క్లుప్తంగా

సీసీ రోడ్డు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): మండలంలోని తుక్కాపూర్ మదిర కాశవాడలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రభుత్వం రూ.20 లక్షలు మంజూరు చేసింది. దీంతో కాశవాడలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, మాజీ సర్పంచ్‌లు విజయ్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, నాయకులు శ్రీనాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, స్వామి పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనలో విద్యార్థులు



అర్బన్ పార్కును సందర్శిస్తున్న విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: క్షేత్ర పర్యటనలతో విద్యార్థులు మరిన్ని విషయాలు నేర్చుకునే అవకాశముంటుందని కొడకండ్ల పాఠశాల హెచ్‌ఎం మధునాల శ్రీనివాస్ అన్నారు. విజ్ఞాన, విహార యాత్రలో భాగంగా గజ్వేల్‌లోని వాగుగడ్డ హనుమాన్ దేవాలయం, పాండవుల చెరువు, సంగాపూర్‌లోని అర్బన్ పార్కుతో పాటు ఆర్డీఓ, తహసీల్దార్, పోస్టాఫీస్ కార్యాలయాలను సోమవారం సందర్శించారు. అదే విధంగా వరి, మొక్కజొన్న, పత్తి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించినపుడే కొత్త విషయాలను నేర్చుకునే అవకాశముంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెహాల, రాజమణి, వంట కార్మికులు నర్సమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

దోమల నివారణ సామగ్రి అందజేత

గజ్వేల్‌రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొంటే దోమలను నివారించవచ్చని మండల పరిధిలోని కొల్గూరు మాజీ ఎంపీటీసీ గొడుగు జ్యోతిస్వామి సూచించారు. గ్రామంలో ప్రజలు దోమలతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకొన్న ఆయన పంచాయతీ కార్యదర్శులకు దోమల నివారణ మందు, బ్లీచింగ్ పౌడర్ తదితర సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు నరేశ్, గ్రామస్తులు కిష్టయ్య, ఆగయ్య, కనకయ్య, సత్తయ్య, బాల్‌రాజుగౌడ్, పారిశుద్ధ్య కార్మికులు యాదయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



మాట్లాడుతున్న చంద్రభాను

మద్దూరు(హుస్నాబాద్): ప్రభుత్వం నుంచి ఉపాధ్యాయులకు రావలసిన బిల్లులను వెంటనే చెల్లించాలని డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బాకీ చంద్రభాను డిమాండ్ చేశారు. మండలంలోని రేబర్తిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావలసిన నాలుగు పెండింగ్ డీఏలను వెంటనే చెల్లించాలన్నారు. అలాగే సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని అమలు చేయకుండా శాస్త్రీయ విద్యా విధానాన్నే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరసింహులు, మల్లేశం, మహమ్మద్ రఫత్ ఉమర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనపై వర్క్‌షాప్

సిద్దిపేటఅర్బన్: మండలంలోని ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు లక్ష్య సాధనపై వర్క్‌షాప్ నిర్వహించారు. సందర్భంగా జగిత్యాల జేఎన్‌టీయూ సీఎస్సీ ప్రొఫెసర్ డాక్టర్ విశ్వనాథ్‌రాజు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని, కమ్యూనికేషన్, టీం వర్క్, సమస్యను పరిష్కరించే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. పూర్వ విద్యార్థులతో మాట్లాడి తమ అనుభవాలను తెలుసుకోవాలని, ఆన్‌లైన్ కోర్సుల ద్వారా ఎక్కువ నైపుణ్యం నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, వైస్ ప్రిన్సిపాల్ బెనర్జీ, పీఆర్వో రఘు, విద్యార్థులు పాల్గొన్నారు.



జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్‌లో పార్వతీపరమేశ్వర ఆలయం



హుస్నాబాద్: ముస్తాబైన సిద్దేశ్వర క్షేత్రం



తొగుట(దుబ్బాక): రాంపురంలోని కోటిలింగేశ్వర దేవాలయం



కొండపాక(గజ్వేల్): ముస్తాబైన మర్పడ్గ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రం

మహిమాన్వితుడు.. మహాదేవుడు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రముఖ ఆలయాలు ముస్తాబయ్యాయి. 26న ఉత్సవాలు నిర్వహించేందుకు ఆయా ఆలయ కమిటీల సభ్యులు, నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

హుస్నాబాద్‌రూరల్: మండల పరిధిలోని పొట్లపల్లిలో ఉద్భవించిన స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినమైన బుధవారం ఉదయం 5 గంటలకు మహాన్యాసక పూర్వక రుద్రాభిషేకాలు ప్రారంభం కానున్నాయి. రాత్రి 8 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 12 గంటలకు లింగోద్భవన కాలం ప్రత్యేక పూజలు నిర్వహించి, 27న రుద్రాభిషేకం, నివేదన, హారతి, మంత్రపుష్పం తదితర కార్యక్రమాలు జరగనున్నాయి.

5 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు

మర్కూక్(గజ్వేల్): మండలంలోని అంగడి కిష్టాపూర్ ఉమామహేశ్వర స్వామి కోవెల బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఐదు రోజుల పాటు ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతాయి. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గుప్త, సభ్యులు కాసుల మహేందర్‌రెడ్డి, దుద్దెడ నర్సింహులు, కుమ్మరి లక్ష్మయ్య, లింగాని రాములు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

ఖాత గ్రామంలో..

నంగునూరు(సిద్దిపేట): మండలంలోని ఖాత గ్రామంలో వెలసిన త్రిపుర సుందరీసహిత మహాదేవుడి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు రంగం సిద్ధమైంది. ఐదు రోజుల పాటు అభిషేకాలు, అఖండ దీపారాధన, ధ్వజారోహణం, శకట ప్రదర్శన, సుప్రభాతసేవ, గణపతిపూజ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. బుధవారం లింగోద్భావ సమయంలో స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేలా అన్నిఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కాచం ప్రకాశ్, కమిటీ సభ్యులు తెలిపారు.



మర్కూక్(గజ్వేల్): ఆలయంలో కొలువైన ఉమామహేశ్వర స్వామి



నంగునూరు (సిద్దిపేట): బద్దిపడగలో దర్శనమిస్తున్న రాజేశ్వరస్వామి

బద్దిపడగలో..

నంగునూరు మండలంలోని బద్దిపడగలో ప్రాచీనమైన రాజరాజేశ్వరీ ఆలయంలో మూడు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, బండ్లు తిరుగుట తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు.

తొగుటలో..

తొగుట(దుబ్బాక): మండల కేంద్రంలోని శివాలయం, రాంపురంలోని కోటిలింగాల దేవాలయం, కాన్గల్‌లో బుగ్గ రాజేశ్వరస్వామి, ఎల్లారెడ్డిపేటలో త్రిలింగేశ్వరాలయంలో ఉత్సవాలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తిచేశారు. రాంపురం కోటిలింగాల దేవాలయంలో శివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు పలుకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ప్రధాన పూజారి ప్రసాద్‌శర్మ తెలిపారు. ఆలయ పీఠాధిపతి శ్రీమాధవానంద సరస్వతి స్వామి పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు.



నంగునూరు(సిద్దిపేట): కొండపై ఆలయం సిద్ధం

సిద్దేశ్వర ఆలయంలో..

హుస్నాబాద్: కాకతీయుల కాలంలో స్థానిక సిద్దేశ్వర గుట్టపై నిర్మించిన అన్నపూర్ణ సహిత సిద్దేశ్వర ఆలయంలో శివరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శివరాత్రి రోజున మంత్రి పొన్నం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కొండపాకలో..

కొండపాక(గజ్వేల్): మండలంలోని మర్పడ్గ, దుద్దెడ, కొండడపాక, సిర్సనగండ్ల, కుకునూరుపల్లి గ్రామాల్లో శైవాలయాలు ముస్తాబయ్యాయి. పెద్దపట్నం వేయడం, ఒగ్గు కళాకారుల నృత్యాలు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. మంగళవారం నుంచి ఉత్సవాలు ప్రారంభమై గురువారం పెద్దపట్నంతో ముగిస్తాయని క్షేత్రం నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ తెలిపారు. భక్తులు ఎలాంటి అసౌకర్యాలు ఏర్పడకుండా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

మండల పరిధిలో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్, జగదేవ్‌పూర్, మునిగడప, గొల్లపల్లి, చాట్లపల్లి, ఇటిక్యాల, పీటీ వెంకటాపూర్, దౌలాపూర్, పీర్లపల్లి గ్రామాల్లో శివాలయాలు, మల్లన్న దేవాలయాలు ముస్తాబయ్యాయి. తిగుల్‌లో పార్వతీపరమేశ్వర ఆలయం, జగదేవ్‌పూర్‌లోని మల్లన్న దేవాలయంలో మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. మంగళవారం జెండా ఆవిష్కరణ, సాయంత్రం గంగతెప్ప, బుధవారం స్వామివారి కల్యాణోత్సవం, ఒగ్గు కథ, గురువారం అగ్ని గుండాలు, ఎడ్ల బండ్ల ఊరేగింపులు, అన్నదానం నిర్వహించనున్నారు. అలాగే తిగుల్ గ్రామంలో పార్వతీదేవి ఆలయంలో బుధవారం అమ్మవారి కల్యాణం, గురువారం ఎడ్లబండ్ల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు వినయ్ తెలిపారు.

అంకంపేట చెరువులోకి నీటిని వదలండి



రోడ్డుపై బైఠాయించిన అంకంపేట రైతులు

రోడ్డుపై బైఠాయించిన రైతులు

సిద్దిపేటరూరల్: చింతమడక చెరువు నుంచి అంకంపేట చెరువులోకి నీటిని విడుదల చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అంకంపేట రైతులు లక్ష్మీదేవిపల్లి వద్ద రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లన్నసాగర్ కాలువ ద్వారా చింతమడక చెరువులోకి నీళ్ళు వచ్చినప్పటికీ అంకంపేటకు నీళ్లు వదలడం లేదన్నారు. ప్రస్తుత సమయంలో పంటలకు నీళ్లు ఎంతో అవసరమని అన్నారు. అధికారులు స్పందించి వెంటనే అంకంపేట చెరువులోకి నీటిని వదిలేలా చూడాలన్నారు. పలువురు రైతులు పురుగుల మందు డబ్బాలు తెచ్చుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామాల రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

55 వేల ఉద్యోగాలిచ్చిన ఘనత కాంగ్రెస్‌దే..

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు ఖాయం
- నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి

దుబ్బాకటౌన్: ఆదిలాబాద్, మెదక్, కరీంనగర్ పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వుట్కూరి నరేందర్‌రెడ్డి గెలుపు ఖాయమని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ సమన్వయ కర్త సాంబయ్యతో కలిసి సోమవారం దుబ్బాకలోని పలు ప్రవేట్ కళాశాలలు, లచ్చపేట, రామక్కపేట ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పాలనలో 15 నెలల్లో 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించిందన్నారు. కార్యక్రమంలో రవి, శ్రీనివాస్, కమలాకర్, భరత్, దేవేందర్, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

సీపీఎం మద్దతు

సిద్దిపేటఅర్బన్: కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం సిద్దిపేటలోని కార్మిక, కర్షక భవన్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర కమిటీ కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తోందన్నారు. నాయకులు గోపాలస్వామి, శశిధర్, ఎల్లయ్య, సత్తిరెడ్డి, భాస్కర్, రవికుమార్, శిరీష తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాకలో ప్రచారంలో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి

గెలుపునకు కృషి చేయాలి

సిద్దిపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డి గెలుపునకు పార్టీ నాయకులు కృషి చేయాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్ పిలుపునిచ్చారు. నారాయణరావుపేటలో కలీం, డీసీసీ ఉపాధ్యక్షుడు మంద పాండుల సమక్షంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని పది గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బాబేష్, వనజ, రమేశ్‌గౌడ్, ఇబ్రహీం, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి

బెజ్జంకి(సిద్దిపేట)/సిద్దిపేటకమాన్: కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా నరేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మానకొండూర్ కో–ఆర్డినేటర్ రఘువర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దామోదర్, రత్నాకర్‌రెడ్డి, ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, కుమార్, రాములు, సందీప్, కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సిద్దిపేట బార్ అసోసియేషన్ సభ్యులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

రైతులకు సాగునీరు అందించాలి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): దేవాదుల ప్రాజెక్ట్ ద్వారా తపాసుపల్లి రిజర్వాయర్ నింపి రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేయాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణకేంద్రంలో ఓ ప్రైవేటు కంటి ఆసుపత్రిని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ తపాసుపల్లి రిజర్వాయర్ ఆయకట్టు ప్రాంతం సాగునీరులేక సంక్షోభంలో ఉందన్నారు. భూగర్భ జలాలు తగ్గి బోర్లు అడుగంటి పోయాయని, కొత్తబోర్లు పడే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగంగా ధర్మసాగర్, గండిరామారం రిజర్వాయర్‌లకు నీటిని లిఫ్ట్ చేయాల్సిన మోటార్లు 15 రోజులు బంద్ చేసినా అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా తప్పుడు ప్రచారాలు మాని తపాసుపల్లి రిజర్వాయర్‌ను దేవాదుల నీటితో నింపి సాగునీరందేలా కృషి చేయాలని కోరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, బాల్‌నర్సయ్య తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా

ఎమ్మెల్సీ అభ్యర్థికి నిరుద్యోగుల విరాళం

దుబ్బాక: మెదక్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి మచ్చ శ్రీనివాస్‌కు పలువురు నిరుద్యోగులు అండగా నిలిచారు. దుబ్బాకలో సోమవారం పలువురు నిరుద్యోగులు శ్రీనివాస్‌ను కలిసి ఎన్నికల ఖర్చు కోసం తమ వంతుగా విరాళాలు అందించారు. ఆయన మాట్లాడుతూ తాను గరీబోళ్ల పక్షాన బరిలో ఉన్నానని ధనవంతులు.. పేదోళ్లకు మధ్యన జరుగుతున్న ఈ ఎన్నికల్లో పట్టభద్రులు ఆలోచించి ఓట్లు వేయాలన్నారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేశ్, చంద్రారెడ్డి, అనిల్‌రెడ్డి, చందు ఉన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

డీఈ మహేశ్

హుస్నాబాద్‌రూరల్: తారురోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని డీఈ మహేశ్ ఆదేశించారు. పొట్లపల్లి, ఆరెపల్లి మధ్య జరుగుతున్న తారురోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పొట్లపల్లి నుంచి ఆరెపల్లి వరకు 3కి.మీల మేర డబుల్‌రోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరు చేసిందన్నారు. శివరాత్రి జాతరకు భక్తులు తరలి వస్తారని, వారికి ఇబ్బందులు లేకుండా రోడ్డు పనులు వేగంగా పూర్తి చేయిస్తున్నట్లు చెప్పారు. అలాగే పందిల్ల స్టేజి నుంచి అక్కన్నపేట మండలం ధర్మారం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.



పనులు పరిశీలిస్తున్న మహేశ్

సంక్షిప్త వార్తలు

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించిందని సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 16 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో సోమవారం హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.27 వేల జరిమానా, ఇద్దరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.

◆ వింగ్ కమాండర్ సందర్శన

సిద్దిపేటఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలను బేగంపేట ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్ గురుప్రీత్ సోమవారం మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. ప్రిన్సిపాల్ సునీతతో మాట్లాడారు. భారత వైమానిక దళంలో రాణించాలనే దృక్పథం ఉన్న విద్యార్థులు విద్యను పూర్తి చేసిన అనంతరం ఎయిర్‌ఫోర్స్‌లో చేరాలని సూచించారు. ఎయిర్‌ఫోర్స్ కోర్సులపై అవగాహన కల్పించాలని కోరారు.

◆ మోటార్లు తొలగించాలని వినతి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కమలాయపల్లి చెరువులో వేసిన మోటార్లను తొలగించాలని ఆరు గ్రామాల రైతులు సోమవారం తహసీల్దార్ సమీర్ అహ్మద్‌ఖాన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమలాయపల్లిలోని వగలరాయుని చెరువు పది గ్రామాలకు ఊట చెరువని, అందులో సుమారు 40 మోటార్లను నడిపిస్తుండడంతో సమీప గ్రామాలకు బోరుబావుల్లో నీరు తగ్గిపోయిందన్నారు.

◆ ఈజీఎస్ పనుల పరిశీలన

మిరుదొడ్డి(దుబ్బాక): ఉపాధి హామీని అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గంగుల గణేశ్‌రెడ్డి సూచించారు. మిరుదొడ్డిలో జరుగుతున్న ఈజీఎస్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. కూలీల ఇబ్బందులను అడిగి తెలుసుకొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ రాము తదితరులు పాల్గొన్నారు.

◆ క్విజ్ పోటీలతో ఉత్తమ ఫలితాలు

హుస్నాబాద్: విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి క్విజ్ పోటీలు ఎంతో దోహదపడతాయని ఎంఈఓ మనీల అన్నారు. హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం సైన్స్ ఫోరం బాధ్యుల ఆధ్వర్యంలో సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మనీల మాట్లాడుతూ 17 పాఠశాలల నుంచి 68 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అక్కన్నపేట ఎంఈఓ రంగా నాయక్, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, నర్సింహారెడ్డి, వెంకట రమణారెడ్డి, శ్రీనివాస్, రత్నాకర్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

◆ విద్యార్థి దశ చాలా కీలకం

హుస్నాబాద్: విద్యార్థి దశ చాలా కీలకమని, సక్రమ మార్గంలో వెళ్లేవారు ఉన్నత స్థితికి చేరుకుంటారని ప్రొబేషనరీ ఎస్‌ఐ సౌజన్య అన్నారు. పట్టణంలోని నవభారత్ హైస్కూల్‌లో సోమవారం మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మవద్దన్నారు. ప్రేమ, పెళ్లి అంటూ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. సోషల్ మీడియా, సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ రవి, ఉపాధ్యాయులు, షీటీమ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



విద్యార్థులతో ఎంఈఓ సత్యనారాయణరెడ్డి

దుబ్బాకటౌన్: విద్యార్థులు స్వీయ అనుభవం ద్వారానే నైపుణ్యం సాధిస్తారని ఎంఈఓ సత్యనారాయణరెడ్డి అన్నారు. రాయపోల్ మండలంలోని రాంసాగర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు. డీఈఓగా సాయితేజ్, ఎంఈఓగా ధనుష్, హెచ్‌ఎంగా నిఖిత, ఉపాధ్యాయులుగా పలువురు విద్యార్థులు విధులు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయ, ఉపాధ్యాయులు సుధాకర్, శ్రీకాంత్‌రెడ్డి, లావణ్య పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990